# ప్లే

"ఏయ్ శారదా! వద్దు ప్లీజ్!!"

ఎవరీ ఏయ్ శారద? ఏమిటీ వద్దు ప్లీజ్?

కిటికీ లోంచి వెన్నెల. సత్యం ముఖం మీద వెన్నెల. అతని పెదాల మీద కొంటె నవ్వు. వెన్నెలని వెక్కిరించే నవ్వు. నీలి మబ్బుల్ని సవాలు చేసే గిరజాల జుత్తు. ఎంతటి నెరజాణ కైనా సరే పసికూన లాగా ఒదిగి పోవా లనిపించే విశాల వక్షస్థలం.

నిద్రలోనే నవ్వుల్ని వెలిగిస్తున్న సత్యం వంక కన్నార్ప కుండా అలాగే చూసుకుంటూ చాలా సేపు ఉండి పోయింది సుభద్ర.

వారం రోజులుగా సీన్ ఇలాగే నడుస్తోంది.

రాత్రి భోజనా లయ్యాక బాల్కనీలో కాస్సేపు పచార్లు, విశేషాలు మాట్లాడు కోవడం, ఆ తరువాత పడగ్గదినే పరవశింప జేసే సరస సల్లాపాలు, మన్మథుడికి మత్తెక్కించే రసైక సామ్రాజ్యం...

కాస్సేపు మైమరచిన మగత నిద్రలో సుభద్రను ఏవేవో మధుర స్వప్నాలు పలకరించిన వేళలో...

ఘోరమైన అపస్వరంలా ఆ కలవరింత... "ఏయ్ శారదా! వద్దు ప్లీజ్!... ఏయ్... వద్దూ!..."

సత్యం గొంతు నుంచి సప్తస్వరాల సారంలా మోగుతుంది... అదిరిపడే సుభద్ర గుండెల్లో అగ్ని పర్వతాలు!

అతన్ని కుదిపి లేపాలంటే భయం.

ఎవరా శారద? ఏమా కథ? అని నిలదీసి అడిగేద్దా మని మొదటి సారే అనిపించింది గాని ముందు ఇంకా ఏం కలవరిస్తాడో చూద్దామని ఆగింది.

అయితే వారం రోజులుగా ఇంతే కలవరింత. అందులో మార్పేమీ లేదు. ఏ ఒక్క రాత్రీ ఆగకుండా ఎందుకు కలవరిస్తున్నాడో?

రెండేళ్ళ దాంపత్య జీవితానికి ఇటువంటి అగ్ని పరీక్ష ఎదురవు తుందని సుభద్ర ఎప్పుడూ అనుకోలేదు.

పెద్దలు అన్నీ చూసి నిశ్చయించి చేసిన సంబంధం.

కట్న కానుకలలో ఎటువంటి లోటూ లేదు.

అతని గుణగణాలకి సంబంధించి ఎన్నో రకాలుగా వాకబు చేసి చూశారు.

ఎక్కడా ఎటువంటి రిమార్కు లేదు.

సత్యం అపర సత్యవంతుడు. సిగరెట్లు కాల్చడు. పేకాట జూదం వగైరా లేవు. రేసింగ్ అంటే తెలీదు. క్లబ్బుల కెళ్ళే అలవాటు లేదు. మరీ దుబారా మనిషి కాదు. అలాగని పిసినిగొట్టు కాడు.

ఆడవాళ్ళు?

అందిన సమాచారం మేరకు అతను చాలా నెమ్మదస్తుడు. ఆడవాళ్ళతో అతిగా ప్రవర్తించిన దాఖలాలు లేవు. ఉద్యోగం...డ్యూటీ...ఇల్లు... అంతే. ఫ్రెండ్స్ కూడా తక్కువే.

చేసిన వాకబులన్నీ పూర్తిగా సరైనవే నని, సత్యం నూటికి నూరు పాళ్ళ నిజాయితీ గల వ్యక్తే నని పెళ్ళయిన కొద్ది రోజులకే ఋజువయి పోయింది. జీవితంలో ఎక్కడైనా నిజాలు దాగుతాయి గాని బెడ్‌రూం లో దాగవు. ముఖ్యంగా అనురాగం, ఆప్యాయత వ్యక్తమయేది అక్కడే.

బెడ్‌రూం అంటే సాక్షాత్తూ దేవాలయమే. ప్రేమాలయమే అనిపించింది సుభద్రకు.

ఎక్కడో ఎప్పుడో చదివిన వాక్యం పదే పదే గుర్తొస్తుంది సుభద్రకు. ఇంట్లో అన్ని గదుల కన్న పవిత్రమైన గది పడక గదే.

భావి తరాలు ఊపిరి పోసుకునేది అక్కడే!

అసలే అందగా డైన సత్యం పడగ్గదిలో అపర మన్మథుడై జీవితానందాన్ని పంచుతుంటే జన్మ ధన్యమైనట్టే పులకించి పోయింది సుభద్ర. ఈ ఆనందాన్ని మరి కాస్త నెమ్మదిగా ఆస్వాదించాలన్న కోరికతో పిల్లల్ని కూడా కొంత కాలం ఆపుకున్నారు.

జీవితం దేవు డిచ్చిన అద్భుత మైన వర మని, ఈ భర్త తన పూర్వ జన్మ పుణ్యాలకు ప్రతిఫల మని సుభద్ర మురిసి పోయే తరుణంలో హఠాత్తుగా రాత్రి నిప్పుల వాన కురిసినట్టు మొదలైంది...

"ఏయ్ శారదా!..."

తొలి కలవరింత నుంచే ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ ఎగసి పడే మనసుని బలవంతాన అదుపు చేసుకుంటూ పూర్తి నిగ్రహంతో సత్యం చర్యల్ని గమనించడం మొదలు పెట్టింది.

అతని రొటీన్‌లో మార్పు లేదు. మాటల్లో లోటు లేదు. నవ్వులో కపటం లేదు. తనంటే ఇష్ట మేమీ తగ్గలేదు. ఇల్లంటే ద్వేషం లేదు.

పరోక్షంగా ఆరా తీసింది. అవును. ఆఫీస్‌లో లేడీ క్లర్కు లున్నారు. లక్ష్మి. శ్యామలా రాణి. విమల. అంతే. శారద అనే పేరు చెప్పలేదు సత్యం.

ఏదో కథలో చదివినట్టు... శారద ఎవరింట్లో అయినా కుక్క పిల్ల పేరా? ఎవరో ఫ్రెండ్ వాళ్ళ బేబీ పేరా?...

తను అనవసరంగా అనుమానించి ఫూల్ అవుతోందా? ఆఫీస్ నుంచి వచ్చాక అతని జేబులు తడిమి చూస్తోంది. కర్చీఫ్ చెక్ చేస్తోంది. షర్ట్ పరిశీలించి చూస్తోంది. ఇంకో స్త్రీతో చనువుగా గడిపినట్టు ఏ చిన్న ఆధారమైనా దొరుకుతుం దేమోనని.

తల వెంట్రుక, కుంకుమ మరక, కొత్త రకం సెంట్, గాజు ముక్క, వేరే కర్చీఫ్... ఏదైనా దొరుకుతుం దేమో నని ఆశ. గుండెలు పగిలే భయం ఉంది ఆ ఆశలో.

ఎటువంటి ట్రేస్ దొరక లేదు.

పోనీ "ఏంటి ఎవరో ఆడపిల్లని పలవరిస్తున్నారు..." అని మొహాన్నే అడిగేద్దా మనిపించింది. ఆ ఐడియాని కర్కశంగా అణచి పారేసింది సుభద్ర. అలా బయట పడి అడగడం వల్ల ఎన్నో అనర్థాలు వస్తాయి.

అతను తేలిగ్గా కొట్టి పారేస్తాడు. అది సహజం. "నేను కలవరించడ మేమిటి? అలాగని నువ్వే ఏదన్నా కలగని ఉంటావ్" అన్నా ఆశ్చర్యం లేదు.

శారద అనే అమ్మాయితో అతను సరసాలే సాగిస్తూ ఉంటే... ఆ సంగతి తన దగ్గర ఒప్పుకుంటాడా? అసాధ్యం. బయట పడి అడిగితే ఇక ఈ కలవరింతలు లేకుండా జాగ్రత్త పడిపోతాడు.

గడియారం రెండు గంటలు కొట్టే సరికి సత్యం నిద్రలో మత్తుగా మూలుగుతూ కదిలి కళ్ళయినా తెరవకుండా "సుభద్రా... ఏంటి ఇంకా మేలుకుని?..." అంటూ గాఢంగా పొదువుకున్నాడు.

తెల్లవారే ముందు నిద్రా కలా కలిసి పోయే స్వప్న సౌధంలో రసరాజ్యపు

సరిహద్దులు చూడ్డం అలవాటే!

అతని చేతులు స్వంత ప్రాణం ఉన్న జీవుల్లా కదులు తుండగా అడ్డు చెప్ప లేక అర్పించు కుంటోంది గాని ఆమె మనసు నిండిన వెన్నెల్లో ఎర్రటి మరకలు కొరడా కొసల్లా ఛెళ్ళు మంటున్నాయి.

ఎవరా శారద? ఎవరైనా గానీ... ఆ పేరైనా శబ్దమైనా ఈ మన్మథ మహారాజు పెదవుల మీద... తన భగవంతుడి కలల మీద కలవరింతల మీద వాలకూడదు.

కాని, ఎలా? పొగ కూడా సరిగ్గా తెలియడం లేదు. నిప్పు ఆర్పడం ఎలా? ఎలా??

మరుసటి రోజు... రాత్రి లేటుగా వచ్చిన చంద్రుడు ఘాటుగా నవ్వుతున్నాడు.

చల్ల గాలికి చిరు చెమటలు ఆరుతుండగా ఆద మరచి నిద్ర పోతున్నాడు సత్యం.

మైమరపు తెరల్ని బలవంతంగా నెట్టేస్తూ అతన్ని అనుకుని గాఢ నిద్ర నటించింది సుభద్ర.

క్రితం రోజు రాత్రి నుంచి జెండాలా ఎగురుతున్న ఆలోచనకు కార్య రూపం ఇస్తూ మెల్ల మెల్లగా కాళ్ళకీ చేతులకీ పని చెప్పి సత్యం నిద్ర కాస్త చెదిరేట్టు కదిలింది.

సరిగ్గా అదే సమయంలో తన ముఖంలో నిద్ర కళ ఏ మాత్రం చెక్కు చెదరకుండా గొంతు నిండా తమకాన్ని అరువు తెచ్చుకుని "ఏయ్! వేణూ... ఇప్పుడొద్దు... బావుండ దంటే... వద్దంటుంటే... వినవేం వేణూ...!" అంటూ గోముగా గొణిగింది.

గుండెలు కంట్రోల్ తప్పుతూ కొట్టుకుం టుండగా తల పక్కకి వాల్చి సత్యం కదలికలు కనిపెడుతూంది.

సత్యం నిద్ర చెడింది. ఆమె కలవరింత చెవిన పడింది. అదిరి పడ్డాడు. కల గన్నానా అన్నట్టు చూశాడు. పొగరెక్కిన వెన్నెల ఆమె పెదవుల మీద కర్పూరంలా ధగధగ మని మెరుస్తోంది. ఆమె బుగ్గల మీద సోగ పుప్పొడిలా వైభవంగా చెలరేగి పోతోంది.

ఆ పెదవులూ బుగ్గలూ మరోసారి సున్నితంగా కదులు తుండగా....

"వేణూ! డార్లింగ్! అబ్బ... వద్దంటే వినవే... ప్లీజ్ వేణూ!..." అనే కల కూజితం మధురంగా విన్నాడు సత్యం.

చూస్తూ వింటూ కొయ్య బారి కాస్సేపటికి దిగ్గున లేచి వెళ్ళి దిక్కు తోచని గందరగోళంలో కొట్టు మిట్టాడుతూ... బాల్కనీలో పచార్లు మొదలెట్టాడు.

ఓరకంట అతన్ని చూస్తూ భయపడి పోయింది సుభద్ర. అలా చూస్తూనే ఉండి పోయింది చాలా సేపు. కదలా లన్నా భయ మని పించింది. అతన్ని టెస్ట్ చెయ్య బోయి... ఘోరమైన పొరబాటు చేశా నేమో అనే టెర్రర్ నరనరంలో వణుకు తెప్పించింది.

అతనేం చేస్తా డిప్పుడు? తను నిద్ర పోయాక తెల్లవారు జామున పక్కలోనే పీక నొక్కి చంపేస్తా డేమో! ఇలాగే కిరోసిన్ పోసి చంపేస్తా డేమో!

శ్రీరాముడిలా అడవులకు పంపేస్తాడా?

అగమ్య మైన ఆలోచనలు అమాంతం కబళిస్తుండగా కదలకుండా పడుకోవడం సాక్షాత్తూ నరక బాధ అయిపోయింది సుభద్రకు.

ఒక వైపు... అనుకున్న పని చేసేస్తే అనాయాసంగా వచ్చే నిద్ర కూడా కమ్మేస్తోంది. ఓర కంటితో సత్యాన్ని గమనిస్తూ చాలా సేపు గడిపింది.

అతను పచార్లు చేస్తూ మధ్య మధ్యలో ఆగుతాడు. చూస్తాడు. మళ్ళీ నడుస్తాడు. పిడికిళ్ళు బిగిస్తాడు. ఆకాశంలోకి చూస్తాడు. వెన్నెలంతా వేడెక్కి శరీరాన్ని దహించి వేస్తున్నట్లు ఆరాట పడి పోతున్నాడు.

అతని అలజడి చూస్తూ ఉండ లేక వెంటనే లేచి వెళ్ళి అతన్ని అమాంతం కౌగిలించుకుని అసలు నిజం చెప్పేద్దా మనిపించింది సుభద్రకు. అయితే ఆ ఆలోచనను బలవంతంగా అణిచి పెట్టింది.

అతన్నే చూస్తున్న కళ్ళు అలసటతో బరువెక్కి మూత బడే సరికి నెమ్మదిగా నిద్ర లోకి జారి పోయింది.

ఎప్పుడో తెల్లవారు జామున...

అతను పక్కలోకి వచ్చినట్టు తెలిసే సరికి ఆత్రంగా చంటి పిల్లలా పొదువు కుంది గాని అతను పురుగును విదిలించి నట్టు విదిలించి కొట్టే సరికి తన ఎత్తుగడ ఎంత విపత్తు తెచ్చిందో మెల్లగా అర్థమైంది.

'ఒక్క రాత్రి చిన్న కలవరింతకే ఇంత మంది పడుతున్నాడు మగ మహారాజు... ఏడు రాత్రులు నే ననుభవించిన నరకం ఏ భగవంతుడికి తెలుసు?... కానీ... తెల్లారనీ చూద్దాం...' అనుకుంటూ అతనికి వీపు మాత్రం అప్పగించి

ఇటు తిరిగి దిండుని కౌగిలించుకుని నిద్ర పోయింది సుభద్ర. పడుకున్నా సత్యానికి నిద్ర ఉండదని ఆమెకు తెలుసు.

"ఎవరా వేణు?" బాణంలా దిగింది ప్రశ్న.

సత్యం చూపులు ఆమె గుండె లోతుల్ని కెలుకు తున్నాయి. అంతు పట్టడం లేదు.

"నిన్నే అడుగుతున్నా... పలకవేం? రాత్రి నిద్రలో మైమరచి పోతూ కలవరించిన ఆ పేరు... నేను చెవులారా విన్నాను... వేణు!... ఎవరతను? ఎలా పరిచయం? ఎన్నాళ్ళుగా సాగుతోంది?..."

మంటకే వేడెక్కించే కోపం ఆ గొంతులో.

అదుపు తప్పే గుండెను అదుము కుంటూ సాధ్యమైనంత అమాయకంగా చూస్తూ "వేణూ ఎవరండీ? కలవరింత ఏమిటండీ?" అంది సుభద్ర.

ఆ మాట పూర్తవక ముందే చెంప ఛెళ్ళుమంది.

"ఇంకా బుకాయించా లని చూడకు! చంపేస్తాను..." అంటూ జడ ఒడిసి పట్టుకునే సరికి అతన్ని ఛర్రున విదిలించి కొట్టింది సుభద్ర.

"స్టాపిట్! ముందు... శారద ఎవరో చెప్పండి! ఏయ్ శారదా! వద్దు ప్లీజ్!... ఏంటి వద్దు ప్లీజ్??" వెక్కిరింతను నొక్కి పట్టి విసురుగా నిలదీసింది.

కొరడా కొస తగిలి నట్టు సత్యం అదిరిపడి "అయితే నేను కలవరించడం... నువ్వు విన్నావా?..." అన్నాడు.

"ఎస్....విన్నాను... ఒక సారీ రెండు సార్లూ కాదు... ఏడు రాత్రులు... ఆడియో రికార్డ్‌లా విన్నాను... మీ మన్మథ లీలలు... మైమరచి కలవరించడాలు... ఎవరో గాని ఆ పిల్ల ఆఫీస్ మనిషి కాదు... నాకు తెలిసిన మీ ఫ్రెండ్స్ తాలూకు ఇళ్ళ మనిషి కాదు. మరి ఇంకెవరు? ఎలా పరిచయం? ఎన్నాళ్ళుగా సాగుతోంది?... చెప్పండి! ముందు శారద సంగతి చెప్తే నేను వేణు సంగతి చెప్తాను..."

అప్పుడప్పుడే మెల్లగా అర్థమవు తున్నట్టు ఆమె కేసి ఎగా దిగా చూశాడు సత్యం. "అంటే నాకు పోటీగా కలవరించావా నువ్వు?"

"ముందు శారద సంగతి చెప్ప మన్నానా?..."

వీరనారిలా ఠీవిగా నిలబడి తనను నిలదీస్తున్న ఆమె వాలకాన్ని అపురూపంగా చూసినంత సేపు చూసి ఆ తర్వాత పకపకా నవ్వేశాడు సత్యం.

"వట్టిదే సుభద్రా!... శారద ఒక బ్లఫ్! ఎవరూ లేరు! కేవలం నేను కల్పించుకుని కలవరించిన పేరు అది!"

"కల్పించు కున్నారా? ఎందుకూ?"

"ఎందుకంటే... ఎక్కడో చదివాను. భార్యాభర్తలకు వైవాహిక జీవితం రొటీన్ అయిపోకుండా ఉండా లంటే అప్పుడప్పుడూ ప్రణయ కలహాలు ఉండాలని... ప్రణయ కలహం ఉండా లంటే... భర్తకి మరో స్త్రీ మీద మనసుంటే చాలదూ?... నాకు నిజంగా అటువంటి పరిచయం ఎవర్తోనూ లేదు... అందుకే శారదను కల్పించుకున్నాను..."

రాముడు మంచి బాలు దన్నంత బుద్ధిమంతుడి పోజుతో చెప్తున్న అతన్ని నమ్మ లేనట్టు చూసింది. "ఏమో! అసలు ఇదే కట్టు కథ కావచ్చు! నన్ను ఇంకా మోసం చేస్తున్నారు... మీ మాటల్ని ఎలా నమ్మడం?..." అంది సుభద్ర.

"తప్పక నమ్మాలి నవ్వు..." అంటూ తన డైరీ తీసి గత వారం రోజుల పేజీలు తిరగేసి చూపెట్టాడు సత్యం.

అందులో స్పష్టంగా రాసుకున్నాడు...

"అలా వేరే అమ్మాయి పేరు కలవరిస్తే సుభద్ర ఏమంటుందో చూడాలి! ఏం చేస్తుందో చూడాలి... రెండు రోజులు అలా కలవరించాను శారద అనే పేరు... సుభద్రలో చలనం లేదు... కొంపదీసి నేను కలవరించడం సరిగ్గా వినడం లేదా?... ఆరు రాత్రులు నేను తమాషా చేసినా సుభద్రకు ఎందుకు తెలియడం లేదు?... కొంప దీసి... నేను వేరే స్త్రీతో గడుపు తున్నట్టు తెలిసినా పట్టించు కోదా?..."

"ఛీ..." అంటూ అతని డైరీని విసిరి కొట్టి అతన్ని వెనక్కి తోసి చెంపల మీద కొట్టింది సుభద్ర. ప్రణయ కలహాన్ని చూసి మన్మథుడే చప్పట్లు కొడుతున్నంత సంతోషంగా కళ్ళు మూసుకున్నాడు సత్యం.

"మరిప్పుడు చెప్పు... వేణు ఎవరూ?..."

"ఆc... నా రహస్య ప్రియుడు!" అంటూ అతన్ని తీగలా అల్లుకుంటూ "ఈ వారం రోజులూ ఎంత హింస పెట్టారు నన్ను! నాకు వేరే డైరీ లేదు సాక్ష్యానికి! కాని సాక్ష్యం చూసుకోవాలంటే..."

"ఎలాగో నాకు తెలుసు..." అంటూ అందుకున్నాడు సత్యం.

29.08.1997 సంచిక